
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 26 జనవరి 2025 | 7





'మిరియాల'కు పద్మశ్రీ

బుర్రకథకు ప్రాణం పెట్టిన అప్పారావు.. ఇటీవల మరణం.. దశదినకర్మ రోజున పద్మశ్రీ ప్రకటన.. రావులపాలెంలో ఇటు విషాదం.. అటు ఆనందం

8

వసతి..మారెను గతి!



ఏలేశ్వరంలో ఎస్సీ హాస్టల్

కూటమి ప్రభుత్వం వచ్చింది.. అభివృద్ధికి బాటలు వేస్తోంది.. ఒక్కొక్కటి మార్చుకుంటూ వస్తోంది.. ప్రస్తుతం గుంతల రోడ్లు మారాయి.. ఎక్కడికక్కడ రోడ్లపై సాఫీగా ప్రయాణం సాగిపోతోంది.. వాట్ నెక్ట్స్ అందరూ అనుకుంటుండగానే.. ప్రభుత్వం మరో కొత్త సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది.. అదే హాస్టల్స్.. వసతి గృహాలను వహ్వా అనేలా తీర్చిదిద్దేలా నిధులు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ వసతి గృహాల అభివృద్ధికి రూ.8.50 కోట్లు నిధులు విడుదల చేయడం గమనార్హం.

- ఎస్సీ హాస్టళ్లకు మంచిరోజులు
- 55 హాస్టళ్లకు రూ.8.50 కోట్లు
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపు
- కూటమి సర్కారు నిర్ణయం
- హాస్టళ్ల మరమ్మతులపై దృష్టి
- టెండర్లు పిలిచిన అధికారులు
- వచ్చే నెల నుంచి పనులు
- బీసీ హాస్టళ్లకు రూ.70 లక్షలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ హాస్టళ్లకు మంచిరోజులు వచ్చాయి. నిన్నటి వరకూ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పైకప్పులు.. గతుకులమయంగా మారిన గచ్చులు.. వేలాడే తలుపులు.. ఏమాత్రం రక్షణలేని కిటికీలు.. రకరకాల విషసర్పాలకు ఆలవాలంగా మరుగుదొడ్లు.. వెలగని లైట్లు.. పని చేయని కుళాయిలు.. ఇదీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల దుస్థితి. గడచిన ఐదేళ్లుగా వీటి బాగోగులను గత వైసీపీ ప్రభుత్వం గాలికొది లేసింది. ఐటన్ నొక్కుడు మినహా విద్యార్థుల బాధలను కనీసం పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ల నుంచీ అనేక అవస్థల మధ్య విద్యార్థులు పడ్డ నరకయాతన అంతా ఇంతా కాదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని మార్చబోతోంది. ఐదేళ్లపాటు బాగోగులకు నోచుకోని వసతి గృహాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏకంగా రూ.8.50 కోట్లతో మరమ్మతులకు ఆమోదం తెలిపింది. దీంతో పనులు చేయడానికి వీలుగా అధికారులు ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. వచ్చే నెలలో ఇవన్నీ మొదలు కానున్నాయి. అటు ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షలతో 16 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిధుల కేటాయింపులిలా..

ఎస్సీ, బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అధికారులు ఇటీవల ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడంతో రూ.8.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ బాల బాలికల వసతి గృహాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయనున్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 ఎస్సీ వసతి గృహాలకు రూ.4.93 కోట్లతో రిపేర్లు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 వసతి గృహాలకు రూ.3.83 కోట్లు, కాకినాడ జిల్లాలో 13 హాస్టళ్లకు రూ.1.23 కోట్లతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో వసతిగృహానికి అక్కడ అవసరాలను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా కోనసీమ జిల్లాలో కె.గంగవరం హాస్టల్ మరమ్మతులకు రూ.8.80లక్షలు, ఉప్పలగుప్తం రూ.14.60 లక్షలు, ముమ్మిడివరం రూ.17.60 లక్షలు, రావులపాలెం రూ.17.30 లక్షలు, అంబాజీపేట రూ.22.40 లక్షలు, ఆలమూరు రూ.25లక్షలు, రామచంద్రపురం రూ.35.30 లక్షలు. రాజమహేంద్రవరం-1 రూ.17.20 లక్షలు, ధవళేశ్వరం రూ.24.96 లక్షలు, పెద్దాపురం రూ.6.15లక్షలు. కాకినాడ అర్బన్‌లో రూ.19.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాలో తొమ్మిది బీసీ బాలబాలిక వసతిగృహాల మరమ్మతులకు రూ.38లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 8 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.29.50 లక్షల చొప్పున ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు.

పైకప్పుల మరమ్మతు చేపట్టి వసతిగృహాల్లో ఇకపై శ్లాబ్‌లకు ఇబ్బంది లేకుండా సురక్షితంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు. అలాగే గచ్చులు,తలుపులు ,కిటికీలకు మరమ్మతులు చేయనున్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతారు. ఎక్కడికక్కడ కొత్త ట్యాంకుల నిర్మాణం, కుళాయిల ఏర్పాటు, కొత్త వైరింగ్ చేయనున్నారు. ఈ పనులు ఏపీ

ఏం చేస్తారంటే..

ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), ఆర్‌డబ్ల్యూ ఎస్,పీఆర్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇటీవల ఈ విభాగాలు టెండర్లు పిలిచాయి. వచ్చేనెల రెండో వారం నుంచి పనులు ప్రారంభంకానున్నాయి.

'అప్పనపల్లి'కి భక్తుల తాకిడి



మంచు కురుస్తున్న వేళలో ఘాట్‌లో పుణ్యస్నానాలు



మామిడికుదురు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామివారికి శనివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి తొలిహారతి ఇచ్చి భక్తులకు దర్శనాలు కల్పించారు. సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామి వారిని 4 వేల మంది భక్తులు దర్శించుకుని 2700 భక్తులు నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల ద్వారా రూ.2,67,178 ఆదాయంగా వచ్చిందని ఆలయ ఏసీ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

అంతర్వేది కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై ఆర్డీవో మాధవికి వివరిస్తున్న ఏసీ సత్యనారాయణ

అంతర్వేది, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో జరగబోయే అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఆర్డీవో కె.మాధవి అన్నారు. శనివారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఆమె కల్యాణోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా క్యూలైన్, వీఐపీ, సాధారణ దర్శన మార్గాలను పరిశీలించారు. అనంతరం ఈ సంవత్సరం ఆలయానికి ఉత్తరభాగంలో ఏర్పాటు చేయబోయే స్వామి వారి తెప్పోత్సవ తాత్కాలిక చెరువు నిర్మాణ పనులను పరిశీలించారు. కల్యాణ షెడ్డు, కమాండ్ కంట్రోల్ రూమ్, పార్కింగ్, రోడ్డు మార్గాలు తదితర ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా, తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి దర్శనాలు, రోడ్డు మార్గాల బోర్డులను భక్తులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సీఐ నరేష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఈవోపీఆర్డీ, మండల సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండవరం హైస్కూల్ ఉపాధ్యాయుడికి సైన్స్‌ఫెయిర్‌లో అవార్డు



అవార్డు అందుకుంటున్న గణేష్‌నరసింహారావు

అంబాజీపేట, జనవరి25(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత దేశ సైన్సు ఫెయిర్‌లో ఉపాధ్యాయ కేటగిరీలో అంబాజీపేట మండలం తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కందాల గణేష్‌నరసింహారావు ప్రదర్శించిన చెత్త నుంచి సంపద అనే ప్రాజెక్టుకు జాతీయ ఉత్తమ ప్రదర్శన అవార్డు లభించిది. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు ఈ విషయాన్ని విలేకర్లకు వివరించారు. ఉపాధ్యాయుడు గణేష్ నరసింహారావును పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఆర్జేడీ నాగమణి, డీఈవో షేక్ సలీంబాషా, జిల్లా సైన్సు అధికారి జి.వి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, ఎస్ఎంసీ సభ్యులు, హెచ్‌ఎం కేశవాచార్యులు అభినందనలు తెలిపారు.



ప్రధాన వేదిక ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణ



వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

రిపబ్లిక్‌డే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



విద్యుద్దీపాలంకరణలో ఆర్డీవో కార్యాలయం

ముస్తాబైన బాలయోగి స్టేడియం

విద్యుద్దీపాలతో మిరుమిట్లు గొలుపుతున్న ప్రభుత్వ కార్యాలయాలు

అమలాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. జిల్లా ఆవిర్భావం తర్వాత మూడో ఏడాది జరుగుతున్న రిపబ్లిక్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పోలీసు, రెవెన్యూతో సహా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను త్రివర్ణ పతాక రంగులతో కూడిన విద్యుద్దీపాలతో అలంకరించారు. స్టేడియం పక్కనే ఉన్న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంతో పాటు ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న ఆర్డీవో కార్యాలయం, ఇతర పోలీసు, రెవెన్యూ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్టేడియంలో సభా వేదికతో పాటు అతిథులు ఆసీనులయ్యేందుకు ప్రత్యేక గ్యాలరీలను కూడా సిద్ధం చేశారు. గ్రౌండ్‌లో పోలీసు పెరేడ్ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గౌరవ వందనం స్వీకరించనున్నారు. పోలీసు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి కవాతు అనంతరం ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు రూపొందించిన ప్రత్యేక శకటాల పెరేడ్ కూడా నిర్వహించనున్నారు. వీటితో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో రూపొందించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసుకుంది. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లాలోని ఆర్డీవోలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. రిపబ్లిక్ డే ఏర్పాట్లను ఆర్డీవో కె.మాధవి, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, తహశీల్దార్లు పలివెల అశోక్‌ప్రసాద్, వీఎస్ దివాకర్ పరిశీలించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ మహేష్‌కుమార్ జాతీయ పతాక ఆవిష్కరణ నిర్వహిస్తారు. 9.10 గంటలకు సాంప్రదాయక పోలీసు కవాతు జరుగుతుంది. 9.30 గంటలకు జిల్లా ప్రగతిపై కలెక్టర్ 20 నిమిషాల పాటు ప్రసంగిస్తారు. 9.50కు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, 10.30 గంటలకు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11 గంటలకు విశిష్ఠ సేవలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది

జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అమలాపురం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలక భూమిక పోషిస్తాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది అన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్లేనని ఆయన పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం జిల్లాస్థాయిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే అర్హులైన వారంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ఎన్నికల జాబితా సవరణలో భాగంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలోను కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను ప్రకటించామన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఓటర్లందరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం 40 శాతం అంగవైకల్యం, వృద్ధుల కోసం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్ద ఓటింగ్ సౌలభ్యాన్ని గత ఏడాది తీసుకువచ్చిందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞను కలెక్టర్ విద్యార్థులు, పౌరులచే చేయించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు అయిన ఓటర్లను సన్మానించారు. యువ ఓటర్లకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి పోటీలు నిర్వహించగా విజేతలైన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ప్రత్యేక ఎన్నికల జాబితా సంక్షిప్త సవరణలో ఉత్తమ సేవలు అందించిన బీఎల్వోలకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు, తహశీల్దార్లు పలివెల అశోక్ ప్రసాద్, వాసా ఎస్.దివాకర్, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, రంకిరెడ్డి కాశీ, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, సరిదే సత్యపల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

3కే రన్ నిర్వహణ



3కే రన్‌లో పాల్గొన్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ నుంచి 3 కే రన్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి జెండా ఊపి 3కే రన్‌ను ప్రారంభించారు. మంచు దుప్పటి కప్పేసినప్పటికీ పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి అందరినీ ఉత్సాహపరుస్తూ 3కే రన్‌లో జేసీ పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి అమలాపురం గడియార స్తంభం సెంటర్ వరకు నిర్వహించిన 3కే రన్‌లో ఆర్డీవో కొత్త మాధవి, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, కరాటం ప్రవీణ్, తహశీల్దార్లు పలివెల అశోక్‌ప్రసాద్, వాసా ఎస్.దివాకర్, గోటేటి గంగాధరం, ఆశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు!

మూతపడిన ఇసుక, తువ్వమట్టి అక్రమ ర్యాంపులు

ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు

ఏడుగురు వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

పి.గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలో గత కొన్ని రోజులుగా నడుస్తున్న ఇసుక అక్రమ ర్యాంపులతో పాటు ఇటీవల ప్రారంభించిన తువ్వ మట్టి ర్యాంపులు సైతం ఎట్టకేలకు మూతపడ్డాయి. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వరుస కథనాలతో అధికారులు స్పందించారు. మండలంలో ఎక్కడైనా ఇసుక మట్టి తవ్వకాలు జరిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పాటు గ్రామ పరిధిలోని వీఆర్వోలపై కూడా క్రమశిక్షణా చర్యలకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు మండలంలోని డీఎస్ పాలెం, మానేపల్లి, గంటిపెదపూడి, లంకలగన్నవరం తదితర గ్రామాలలో అక్రమ ఇసుకను ఉచిత ఇసుక ముసుగులో కూటమి నాయకులు దోచుకుపోయారు. అలాగే కూటమి పెద్ద అండతో మాఫియా ఇసుక, తువ్వమట్టి మాఫియా ఉడిమూడి, వైవీ పాలెం, మానేపల్లి పరిధిలోని కందాలపాలెం, డీఎస్ పాలెం తదితర ప్రాంతాలలో ర్యాంపులకు సన్నాహాలు ప్రారంభించి కొన్ని చోట్ల తవ్వకాలు కూడా ప్రారంభించింది. దీంతో ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో తువ్వమట్టినీ వదల్లేదు... కథనం వెలువడటంతో పాటు అదే సమయంలో జనసేన పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధితో పాటు పలువురు నాయకులు ఇదే విషయంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. మండలంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలించిన డివిజన్ స్థాయి అధికారి అనుమతులు ఉంటేనే ర్యాంపులు నిర్వహించుకోవాలని నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత మాఫియా పెద్దలతో పాటు మండల స్థాయి అధికారులకు కూడా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో స్పందించిన తహశీల్దార్ గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను నిలుపుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడు గ్రామాల వీఆర్వోలకు నోటీసులు అందించారు. ఈ విషయంపై తహశీల్దార్‌ను వివరణ కోరగా...జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు ఆదేశాలు మేరకు విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఏడు గ్రామాల వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు అందించామని తెలిపారు. నోటీసులు తీసుకున్న వీఆర్వోలు 24 గంటల్లో తహశీల్దార్ వద్ద హాజరై లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు.

రైతుబజార్ పునఃప్రారంభం



రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆకు, కూరగాయల సాగు చేసే రైతులు తమ ఉత్పత్తులను తాజాగా వినియోగదారులకు గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేందుకు వీలుగా అమలాపురం రైతు బజార్‌ను పునఃప్రారంభించినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో ఉన్న రైతుబజార్‌ను ఆయన ప్రారంభించారు. 25 ఏళ్ల క్రితం సీఎం చంద్రబాబు ఎంతో ముందుచూపుతో రైతుబజార్లకు అంకురార్పణ చేశారన్నారు. స్థానికంగా లంక ప్రాంతాలు లేకపోవడంతో ప్రస్తుతం ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, పి.గన్నవరం తదితర మండలాల నుంచి కూరగాయలను రైతులు తీసుకువచ్చి రైతు బజార్‌లో వారికి కేటాయించిన 55 దుకాణాల ద్వారా విక్రయించే ఏర్పాట్లు చేశామన్నారు. వీటితో పాటు చికెన్, మటన్, చేపలు వంటి వాటిని విక్రయించేందుకు ప్రత్యేక షాపులు, బియ్యం, కిరాణా వంటి సరుకులు విక్రయించేందుకు మరికొన్ని షాపులను కేటాయించామన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రత్యేకంగా స్టాల్స్ కేటాయించామన్నారు. రావులపాలెం మాదిరిగా అమలాపురంలో కూరగాయల ధరలు తక్కువగా ఉండి తాజాగా లభిస్తాయని వివరించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుబజార్‌లో పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పార్కింగ్, వసతులు, మరుగుదొడ్లు, షాపుల నవీకీకరణ పనులు ప్రారంభించామన్నారు. రైతులతో పాటు కొనుగోలు దారులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కొత్త మాధవి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, జిల్లా వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి కేఎస్వీ విశాలాక్షి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, అధికారి జయవెంకటలక్ష్మి, బొర్రా ఈశ్వరరావు, మల్లుల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

బేకరీ ముసుగులో మద్యం దందా

36 మద్యం సీసాలు స్వాధీనం.. ఒకరి అరెస్టు

అల్లవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం కోడూరుపాడు పరిధిలోని గుడ్డివానిచింత వద్ద గుబ్బల రవి కాంప్లెక్సులో బేకరీ ముసుగులో బహిరంగంగా జరుగుతున్న బెల్టు, మద్యం అమ్మకాలపై అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ శనివారం ఆకస్మికంగా దాడి చేశారు. చాలాకాలంగా బేకరీ, పాన్ షాపులో మద్యం విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఈ దాడి జరిగింది. షాపు వెనుక బాత్రూమ్ పైన పేర్చిన 36 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అల్లవరం వెదుళ్లపాలేనికి చెందిన షాపు యజమాని మామిడిశెట్టి వెంకటసత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంక్రాంతి పండుగ నుంచి బేకరీ, పాన్‌షాపులోనే బెల్టు షాపులో మందుబాబులు మద్యం సేవించేలా ఏర్పాట్లు చేసినట్టు పోలీసులు గుర్తించారు. గతంలో కూడా అమలాపురం ఎక్సైజ్ అధికారులు మామిడిశెట్టి వెంకటసత్యనారాయణ ఇంటిపై దాడి చేసి 561 యానాంకు చెందిన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను అప్పట్లో స్వాధీనం చేసుకున్నారు. ఇదే వ్యక్తి గల షాపు నుంచి సీఐ 36 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపితే కఠినచర్యలు తప్పవని సీఐ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. షాపు యజమాని సత్యనారాయణపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

వాడపల్లి భక్త జనసంద్రం

- ఏకాదశి కావడంతో భారీ సంఖ్యలో భక్తుల రాక
- వెంకన్న నామ స్మరణతో మార్మోగిన ఆలయం
- శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.37.54 లక్షలు



భక్తులతో రద్దీగా ఉన్న వెంకన్న ఆలయ ప్రాంగణం

ఆత్రేయపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఏకాదశి కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం , తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలకరించారు. స్వర్ణశోభితుడైన శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు జరిపారు. భారీ క్యూలైన్ల ద్వారా మండపం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీలలిత కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.37.54 లక్షలు లభించినట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసభ్యులతో వచ్చి దర్శించుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికి, విశేష పూజలు అందించారు. ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిశారు.



విజయనగరం ఎంపీ అప్పలనాయుడుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉప కమిషనర్ చక్రధరరావు

'మిరియాల'కు పద్మశ్రీ అవార్డు



సీఎం చంద్రబాబుతో మిరియాల అప్పారావు(ఫైల్)

- కళకు ప్రాణం పెట్టిన అప్పారావు
- బుర్రకథకు ప్రత్యేక గుర్తింపు ఈయనతోనే
- బుర్రకథతో ప్రేక్షకులను మెప్పించడంలో దిట్ట
- 365 రోజుల్లో 300 బుర్రకథలు
- 5వేలకు పైగా బుర్రకథల స్టేజీ ప్రోగ్రాంలు.. ఎన్నో అవార్డులు, బిరుదులు
- పుట్టింది కాకినాడ జిల్లా నడకుదురు
- అనారోగ్యంతో ఈనెల 15న రావులపాలెంలో మృతి.. శనివారం దశదినకర్మ రోజేనే పద్మశ్రీ ప్రకటన

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సినిమాలు, టీవీలు ప్రాచుర్యం లేని రోజుల్లో బుర్రకథకు మంచి క్రేజ్ ఉండేది. జాతర్లలో కళాకారులు స్టేజీపై బుర్రకథ చెబుతుంటే ప్రేక్షకులు ఈలలు, కేరింతలు, తప్పట్లతో కళాకారులను ప్రోత్సహిస్తుంటే, ఆ కథలు తెల్లవారే దాకా అలుపెరగకుండా కళాకారులు కళకు ప్రాణం పెట్టి బుర్రకథను చెప్పేవారు. కళకు ప్రాణం పెట్టి ఆ కళలో నవరసాలు పండించడంలో మిరియాల అప్పారావుకు సాటిలేరు అంటే అది అక్షరసత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ముఖ్యంగా కోనసీమతో అనుబంధం ఉన్న మిరియాల అప్పారావు 1949లో కరప మండలం నడకుదురు గ్రామంలో మిరియాల వెంకటరామయ్య- తిరుపతమ్మలకు జన్మించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టి డ్రాయింగ్ మాస్టర్, జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం గురువుల వద్ద శిష్యరికం చేసి ప్రధాన కథకునిగా ప్రావీణ్యం పొందారు. అనంతరం అక్కడ మొదలుపెట్టిన ప్రస్థానం వెనుతిరిగి చూడకుండా ఎన్నో స్టేజీ ప్రోగ్రాంలు చేశారు. 1974లో ఆల్ఇండియా రేడియోలో, 1993లో దూరదర్శన్‌లో ప్రోగ్రాంలు ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించిన బుర్రకథ పోటీలో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్‌ను ముప్పన రామారావు చేతుల మీదుగా అందుకున్నారు. 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ చెప్పిన ఘనుడు ఈయన. 50 ఏళ్ల బుర్రకథ ప్రస్థానంలో అలుపెరగకుండా ఎన్నో స్టేజీ ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందారు. ప్రస్తుతం బుర్రకథ చెప్పేవారిలో 70 శాతం మంది కళాకారులు ఈయన శిష్యులే. ఈయనకు గానగంధర్వ, గాన కోకిల, బుర్రకథ టైగర్, బుర్రకథ మాస్టర్, బుర్రకథ పితామహుడు, వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులను, బిరుదులను పొందారు.

5 వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు...

కళల రంగంలో ప్రావీణ్యం చెందిన మిరియాల అప్పారావు నవరసాలు పండించడంలో ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. దీనిలో భాగంగా ఆయన తణుకు షణ్ముఖ ఆంజనేయరాజు నేతృత్వంలోని నాటక కళా సమితిలో పలు నాటకాల్లోనూ ఈయన నటించారు. శ్రీకృష్ణతులాభారంలో కృష్ణుడు, చింతామణిలో బిల్వమంగళుడు పాత్రలతో ప్రేక్షకుల మదిని దోచారు. ఈయన 1969 నుంచి ప్రారంభించిన స్టేజీ ప్రోగ్రాంలు ఆయన ఓపిక ఉన్నంత వరకు కొనసాగిస్తు వచ్చారు. ఇప్పటివరకు 5 వేలకుపైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు ప్రదర్శించారు.



కుటుంబమే కళారంగం....

మిరియాల అప్పారావు కుటుంబం ఆయనతోపాటు కళారంగంలోనే కొనసాగుతున్నారు. అప్పారావుకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. వారిలో రావులపాలెంలో ఉంటున్న బ్రహ్మాజీ, సుబ్బరాజు, బాబా అనే కుమారులు, వీరనాల లలిత (రావులపాలెం) యడవల్లి శ్రీదేవి (తాడేపల్లిగూడెం) అనే ఇద్దరు కుమార్తెలు కూడా బుర్రకథ కళారంగంలోనే కొనసాగుతుండడం విశేషం.

విచారకరంలో ఆనందకరమైన విషయం..

ఎన్నో స్టేజీ ప్రోగ్రామ్‌లు అందించి ఎందరో ప్రేక్షకులన మన్ననలను పొంది కళారంగానికి వన్నెతెచ్చిన మిరియాల అప్పారావు ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో రావులపాలెంలోని ఆయన కుమారుడు బ్రహ్మాజీ ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. కళారంగంలో ప్రావీణ్యం చెందిన అప్పారావు మృతితో కుటుంబ సభ్యులు, ఆయన శిష్యబృందం విచాకరంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుతో ఆనందం వ్యక్తం చేశారు. ఆయన పద్మశ్రీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- పోలీసుల గాలింపు ముమ్మరం

పెద్దాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ కామాంధుడు నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురంలో శనివారం జరిగింది. చిన్నారి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని భర్త వదిలేశాడు. దీంతో చిన్నారులను పోషించుకునేందుకు ఆ తల్లి కూలీ పనులకు వెళ్తోంది. గ్రామంలో అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన చిన్నారి ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించిన పాలిక వీరబాబు అనే కామాంధుడు చిన్నారిపై లైంగిక దాడికి యత్నించడంతో చిన్నారి గట్టిగా ఏడ్చింది. ఇది గమనించిన స్థానికులు అక్కడకు రావడంతో వీరబాబు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.మౌనిక విచారణ ప్రారంభించారు. దీనిపై కేసు నమోదు కావాల్సి ఉంది. నిందితుడు పరారవ్వడంతో పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలను చేపట్టారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ
- విమానాశ్రయ ఘటనపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్



విమానాశ్రయం వద్ద కూలిన టెర్మినల్ షెడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయం (రాజమహేంద్రవరం) టెర్మినల్ విస్తరణ పనుల్లో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి విమానాశ్రయంలో జరిగిన ప్రమాదస్థలిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. కొంత కాలంగా ఇక్కడ టెర్మినల్ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మొదటి అంతస్తు పై కప్పు ఏర్పాటు చేస్తుండగా పైన ఉన్న గిడ్డర్లు బోల్టులు బిగించడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. ఏదిఏమైనా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మరింత జాగ్రత్త వహించాలన్నారు. ఈ విషయంపై కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడతామన్నారు. దీనికి సంబంధించి నివేదికను అధికారులతో తెప్పించుకుని ఏ విధంగా ముందుకెళ్లాలో పరిశీలిస్తామన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరి పరిశీలన

విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ ప్రదేశాన్ని శనివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పరిశీలించారు. అనంతరం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైన ఉన్న గిర్డర్ల బోల్ట్‌లు బిగించడం వల్లే ప్రమాదం జరిగినట్టు ఆమెకు అధికారులు వివరించారు. కాంట్రాక్ట్ తీసుకున్న చెన్నై రెనాటస్ ప్రాజెక్టు ఎండీ మనోజ్ పూసప్పన్, వైస్ ప్రెసిడెంట్ ఖరుబాకరమ్, ప్రాజెక్టు డీజీఎం శరవణ్‌ను నిలదీశారు. ఈ ఘటనపై ఎంపీ మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో మాట్లాడానన్నారు. ఇప్పటికే విమానయాన అధికారులు విచారణ చేపట్టారని చెప్పారు. నివేదిక అందిన తరువాత నిర్మాణంలో లోపాలు ఉన్నట్టు తేలితే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



అధికారులను వివరాలు అడుగుతున్న ఎంపీ పురందేశ్వరి

మేరా భారత్ మహాన్

- పల్ల వెంకన్న నర్సరీలో ఆకట్టుకుంటున్న ఎర్రకోట వనకూర్పు ఆకృతి



నర్సరీలో మొక్కలతో రూపొందించిన రిపబ్లిక్ డే ఆకృతి

కడియం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కడియపులంకలోని పల్ల వెంకన్న నర్సరీలో పల్ల సత్తిబాబు, ఆయన కుమారులైన వెంకటేష్, వినయ్ మేరా భారత్ మహన్ అంటూ మొక్కలతో రిపబ్లిక్ డే ఆకృతులను రూపొందించారు. మువ్వన్నెల జెండా, ఎర్రకోటతో అక్షరమాలికను తీర్చిదిద్దారు. 76వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దీన్ని ఏర్పాటు చేసినట్టు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ తెలిపారు.

మద్యానికి బానిసై... భార్యతో తరచూ గొడవలు

- అత్తమామ చేతిలో ప్రాణాలు కోల్పోయిన అల్లుడు



గణేష్ మృతదేహం

కడియం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):మద్యానికి అలవాటు పడి భార్యతో తరచూ గొడవ పడుతున్న వ్యక్తి అత్తమామ చేతిలో ప్రాణా లు కోల్పోయిన ఉదంతం కడియపులంకలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... కోరుకొండ గ్రామానికి చెందిన శ్రీరంగం సూర్యవెంకట గణేష్ (36) రెండేళ్ల కిందట తన భార్య మాధవి, ఇద్దరు పిల్లలతో కలిసి కడియపులంకలో నివాస ముంటున్నాడు. గణేష్‌కు మద్యం సేవించే అలవా టు ఉంది. ఈ నేపథ్యంలో భార్యతో తరచూ గొడవపడేవాడు. ఎప్పటిలాగే ఈనెల 24వ తేదీ సాయం త్రం మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యతో ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న గణేష్ అత్త నాగమణి, మామ సత్తిబాబు అడ్డుపడి తలమీద బలంగా కొట్టి గాయపరిచారు. దీంతో విషయం తెలుసుకున్న గణేష్ బంధువులు 108లో హెచ్‌సీకి తరలించారు. అయితే వైద్యులు అప్పటికే చనిపోయినట్టు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఉదయ భాస్కరరావు ఫిర్యాదు మేరకు సీఐ ఏ. వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో రైల్వే డీఆర్ఎం పూజలు



దర్శనాంతరం డీఆర్ఎంతో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడిని శనివారం విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేం ద్ర ఆనందరావు పాటిల్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. దీనిలో భాగంగా స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి ప్రసాదాలు ప్రదానం చేశారు. వీరితోపాటు పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు, తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత పెంటయ్య

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఓ దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన మురముళ్ల పెంటయ్య ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

రెండోరోజూ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



రెండోరోజు పోటీలను ప్రారంభిస్తున్న అజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కోటి

పెద్దాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): : ప్రజల జీవితాలను ప్రతిబింబించేదే కళ అని ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు(కోటి) అన్నారు. పెద్దాపురం మం డలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో గుమ్ములూరి లక్ష్మీనారాయణ కళాప్రాంగణంలో ఉభయ రాష్ట్రాల రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు రెండోరోజు శనివారమూ కొనసాగాయి. కురుమెళ్ల వెంకటరమణ, మరుకుర్తి సత్తిబాబు కళావే దికపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, ఇందన బ్రహ్మానందం, స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు, గోపు నారాయణమూర్తి , తదితరులు పాల్గొన్నారు.

చక్కటి సందేశాన్నిచ్చిన స్వేచ్ఛనాటిక..

స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదని, మన మనసుకు నచ్చినట్టు మన ఇష్టం వచ్చినట్టు విచ్చలవిడిగా ఏదిపడితే అది చేయడానికి ఆడ, మగ ఎవరైనా స్వేచ్ఛలో నిర్ణయాత్మక నియంత్రణ సంరక్షణతో కూడిన నియంత్రణ ఉండాలని, స్వేచ్ఛకు హద్దే ముద్దు అని చక్కటి సందేశాన్ని ఇచ్చేలా ప్రదర్శన సాగింది. సహృదయ ద్రోణాదుల(బాపట్ల) వారు ప్రదర్శించిన వర్క్ ఫ్రం హోమ్ ఆద్యంతం హాస్యభరితంగా సాగింది. ఆహూతులను నవ్వులు పూయించింది. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ (వెలగలేరు) వారు ప్రదర్శించిన రాత నాటిక ఎంతగానో ఆకట్టుకుం ది. పోలుదాసు శ్రీనివాసరావు ఈ నాటికకు రచన, దర్శకత్వం వహించారు.

రెండు బైకులు ఢీ కొని నలుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

ముమ్మిడివరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీనికి సంబంధిచిన వివరాలివి.. మలికిపురానికి చెందిన నెల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మోటారు సైకిల్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా అమలాపురం నుంచి మోటారు సైకిల్‌పై వెళుతున్న అయినవిల్లి మండలం యరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్, భట్నవిల్లికి చెందిన తాడి మల్లపరాజు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వై-జంక్షన్‌లో శనివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన నలుగురిని అంబులెన్సులో హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి : జడ్పీ సీఈవో

పి.గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల పరిధిలోని ముంగండ తాగునీటి ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంపీడీవో గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, బొండాడ నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.రవీంద్రబాబు, జేఈ జి.జయశ్రీ, నేత వెద్రియ్య ఉన్నారు.

ప్రమాదవశాత్తూ రైలు నుంచి పడి వ్యక్తి మృతి

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరుకు చెందిన కడిమి వెంకటరమణ శనివారం ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈయన హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో అన్నవరంలో బంధువుల ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు రైల్వే హెచ్‌సీ శ్యామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి వంతెన సమీపంలో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. 30 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుంది. ఎరుపు రంగు షర్టు, లోపల అపోలో టైర్స్ కంపెనీ టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించినట్టు చెప్పారు. బంధువులు గుర్తించేందుకు వీలుగా మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

పశువుల అక్రమ రవాణా



గోవులను తరలిస్తున్న వ్యాన్

ప్రత్తిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణాను శనివారం పోలీసులు అడ్డుకున్నారు. తుని నుంచి రాజమండ్రికి వ్యాన్‌లో 16 ఆవులను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం చెప్పారు. ఆవులను ఏలేశ్వరంలోని గోశాలకు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డొక్కా సీతమ్మ భోజన పథకం ప్రారంభం

అల్లవరం, జనవరి25(ఆంధ్రజ్యోతి): కొమరగిరి పట్నం న్యాపతి సుబ్బారావు పంతులు జడ్పీ హైస్కూలులో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలపై డొక్కా సీతమ్మభోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థుల కోసం వండుతున్న భోజనాలను జనసేన నాయకులు తనిఖీ చేశారు.

తాచుపాము హల్‌చల్

పి.గన్నవరం, జనవరి25(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటమండలం విద్యుత్‌శాఖలో పనిచేస్తోన్న సతిబాబు పి.గన్నవరం మండలం పోతవరం సూర్య గార్డెన్‌లో ఉంటున్నాడు. ఆ ఇంట్లో శనివారం తాచు పాము హల్‌చల్ చేసింది. స్నేక్‌క్యాచర్ వర్మ తాచు పామును సీసాలో బంధించాడు. 25ఏళ్లు ఉంటాయని, ఈతరహా పామును చూడలేదన్నారు.

రాజశేఖర్ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, వేదికపై ఎమ్మెల్సీ చిరంజీవిరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరఫున బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పిలుపునిచ్చారు. అమలాపురం టీడీపీ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాజశేఖర్ విజయమే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పార్టీ శ్రేణులకు నాయకులు దిశా నిర్దేశం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మండలశాఖల అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, దెందుకూరి సత్తిబాబు రాజు, మల్లుల పోలయ్య, నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

ఐ.పోలవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నాయకులు కృషి చెయ్యాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు పిలుపునిచ్చారు. మురమళ్ళ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద అధ్యక్షతన కూటమి పార్టీల సమావేశం జరిగింది. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన రాజశేఖర్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించిందని, అత్యధిక మెజారిటీతో ఆయనను గెలిపించాలని పరిశీలకుడు సూచించారు. సమావేశంలో రెడ్డి సుబ్రహ్మణ్యం, పేరాబత్తుల రాజశేఖర్, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, పొద్దోకు బాలు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, గొలకోటి దొరబాబు, మందాల గంగసూర్యనారాయణ, బీర సత్యకుమారి, గుద్దటి జమ్మి, ధూళిపూడి చక్రం, కడియం తమ్మయ్య, దొమ్మేటి రమణకుమార్, అర్ధాని శ్రీను, సలాది శేషారావు, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, ఆకాశం శ్రీను, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, దూడల స్వామి, అత్తిలి బాబూరావు, బొంతు శ్రీరాములు, చిక్కాల అంజిబాబు పాల్గొన్నారు.

మారుమూల రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కృషి



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడి, చింతలమెరకకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. రూ.2.05కోట్లతో 2.5కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం తమ ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న అన్ని రోడ్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, నాయకులు చుట్టుగుళ్ల కిశోర్, గంధం భాస్కర్, కొనుకు నాగరాజు, కొమ్ముల కొండలరావు, మల్లాడి విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థినిపై తేనెటీగలు దాడి



పి.గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు తేనేటీగలు పట్టుపై రాయి విసరడంతో ఈగలు చెలరేగిన ఘటనలో 3వ తరగతి విద్యార్థిని స్వల్ప గాయాలు పాలైంది. ఈఘటన మండలంలోని ముంజవరపుకొట్టు హైస్కూల్లో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్కూల్ సమీపంలో చెట్టుకు ఉన్న తేనేటీగలు పట్టును ఒక వ్యక్తి రాయితో కొట్టాడు. దీంతో ఈగలు చెలరేగి అక్కడే ఉన్న 3వ తరగతి విద్యార్థిని అంకాడి దీపికపై దాడి చేయడంతో ఆమె అస్వస్థకు గురైంది. ఉపాధ్యాయులు ఆమెకు ప్రథమ చికిత్స చేశారు. ఆసుపత్రికి తీసుకువెళ్లాలని తండ్రి పోసుబాబుకు సమాచారం అందించారు. ఎంఈవో కె.హెలీనా సిబ్బందితో కలిసి విద్యార్థిని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం స్కూల్లో ఉపాధ్యాయులను ఎంఈవో విచారించారు. ఈఘటనలో కూడా ఉపాధ్యాయులు అలసత్వం వహించారని స్థానికులు మండిపడ్డారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

అంతర్వేది, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరూ అంగన్‌వాడీ సెంటర్ల లో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి అన్నారు. అంతర్వేది దేవస్థానంలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న పద్మావతి మండలంలో పలు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్ల రూపురేఖలు మార్చి ప్రైమరీ ఎడ్యుకేషన్ సెంటర్లగా నామకరణం చేశారన్నారు. పిల్లలు, 26 జిల్లాల్లో విస్తృతంగా పౌష్టికాహారాలు అందించే విధంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే ఇటీవల మిషన్ వాత్సల్య పథకం ద్వారా మూడు మండలాల్లో 69 మందికి నెలకు రూ.4వేలు చొప్పున ఆరు నెలలకుగాను రూ.24వేలు అందించామని తెలిపారు. ఈమిషన్ వాత్సల్య తల్లి, తండ్రి చనిపోయి 18ఏళ్లు నిండని చదువుకుంటున్న బాలికలకు ఈపథకం వర్తిస్తుందన్నారు.

సార్వత్రిక ఎన్నికల మాక్ పోలింగ్



తొండవరం హైస్కూల్‌లో మాక్ పోలింగ్ దృశ్యాలు

అంబాజీపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తొండవరం హైస్కూల్‌లో విద్యార్థులు సార్వత్రిక ఎన్నికల ఘట్టాన్ని తలపించారు. పార్టీలు, గుర్తులు, ప్రచారం, ఎన్నికల హడావిడి, బ్యాలెట్‌బ్యాక్సులు ఎన్నికలు, స్ట్రాంగ్‌రూమ్ కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు, రిజల్ట్స్ వంటివి ప్రత్యక్షంగా చేశారు. ప్రధాన ఎన్నికల అధికారిగా హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు, రిటర్నింగ్ అధికారిగా సోషల్ ఉపాధ్యాయుడు జి.శ్రీనివాస్, మట్టపర్తి రాంబాబులు వ్యవహరించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఎన్నికల కోలాహలం నెలకొంది.

కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ థాలీ బచావో..



అమలాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాల అమలులో వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట థాలీ బచావో కార్యక్రమం నిర్వహించారు. పెన్షన్ల పంపిణీ తప్ప కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు పరచలేదని చిట్టిబాబు ఆరోపించారు. తల్లికి వందనం, ప్రతీ మహిళకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి వంటివి ఏమయ్యాయని ధ్వజమెత్తారు. కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు సూపర్-6 హామీల అమలుకు కంచాలపై గరిటెలతో కొడుతూ నిరసన తెలిపారు. నియోజకవర్గ కోఆర్డినేటర్లు అయితాబత్తుల సుభాషిణి, పాలెపు ధర్మారావు, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణారావు, మహ్మద్ ఆరీఫ్, షకీలా, అప్పన శ్రీరామకృష్ణ, కుడుపూడి శ్రీనివాస్, వడ్డి నాగేశ్వరరావు, అర్ధాని నాగరాజు, మొల్లేటి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధం

- ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి
- ఘనంగా ఓటర్ల దినోత్సవం



ముమ్మిడివరంలో ఓటర్ల దినోత్సవ ర్యాలీ

ముమ్మిడివరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధం వంటిదని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు అని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఓటరు నమోదు అధికారిణి, ఐసీడీఎస్ పీడీ డి.శాంతికుమారి పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం రెవెన్యూ, నగరపంచాయతీ, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి ముమ్మిడివరం హైస్కూలు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఓటరు నమోదు అధికారిణి శాంతికుమారి పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణ, ఎం.శ్రీనివాస్, కె.రామ్మోహనరావు, నగర పంచాయతీ కమిషనర్ జి.రవివర్మ, మేనేజర్ పీవీ నూకరాజు, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, నాగశ్రీను, సత్యదేవ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సహాయకులు, నగర పంచాయతీ సచివాలయ సిబ్బంది, డీఎల్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలి

పి.గన్నవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాల ఆవరణలో తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జరిగిన రంగ వల్లుల పోటీలను ఆయన పరిశీలించారు. ఓటర్ల ప్రతిజ్ఞ, విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్లను, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ జరీనా, పలువురు బీఎల్‌వోలను, నూతన ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, కళాశాల చైర్మన్ చరణ్, ప్రిన్సి పాల్ పివిఆర్ నాయుడు, ఆర్ఐ వర్మ, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగోళి పోటీలు

అయినవిల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని అయినవిల్లిలోని ఎస్ఎస్వీఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. రంగోళి పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

మామిడికుదురు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై ప్రతీ పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, ఓటు వజ్రాయుధమని తహశీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు పేర్కొన్నారు. శనివారం మామిడికుదురు దీప్తి స్కూలు విద్యార్థులు ఓటు అవగాహన ర్యాలీని మామిడికుదరు హైస్కూలు వరకు నిర్వహించారు. ఈసందర్భంగా మామిడికుదురు, నగరం, లూటుకుర్రు, ఈదరాడ స్కూల్స్‌లో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, ఎంఈవో లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, అడబాల తాతకాపు, చుట్టుగుళ్ల లక్ష్మి, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

యానాం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని ఓటర్ల నమోదు అధికారి, పరిపాలనాధికారి మునిస్వామి అన్నారు. శనివారం యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యానాం ఎన్నికల శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఓటు నమోదు చేసుకున్న ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. అదేవిధంగా పలువురు ఉత్తమ బూత్‌లెవిల్ అధికారులను, వివిధ పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో సెక్టారు అధికారులు, కళాశాల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం

రాజోలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్ ఇన్‌చార్జి పి.శైలజ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజోలు ఈఆర్వో పి.శివశంకరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, రంగోళీ, క్విజ్ పోటీలను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పద్మనాభం, ఎన్.రాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువను పెంచాలి

ఉప్పలగుప్తం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విలువైన ఓటుతో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని తహశీల్దార్ వాసా దివాకర్ అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఉప్పలగుప్తంలో నూతన ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఉప్పలగుప్తం నుంచి గొల్లవిల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. గొల్లవిల్లి ఎన్టీఆర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. సర్పంచ్‌ల మండల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంఎస్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కె.బాలాజీ, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

అంబాజీపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని రెవెన్యూ, ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తహశీల్దారు జె.వెంకటేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థునులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ నాగాబత్తుల సుబ్బారావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి బహుమతులను అందించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సత్కరించారు. గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్‌లో సీనియర్ సిటిజన్ అడపా సత్తికొండను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని ఆధ్వర్యంలో వీఆర్వో నాగలక్ష్మి సత్కరించారు.

ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ

అల్లవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అల్లవరంలో తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఓటరుదినోత్సవ ర్యాలీలు, రవితేజ కళాశాలలో సమావేశం జరిగింది. సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. జనసేన నాయకుడు కంకిపాటివీరబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు. తూర్పులంక, గోడిలంక గ్రామాల్లో ఓటరు దినోత్సవ ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞలు చేశారు. ఓటు హక్కు ఆవశ్యకతపై ప్లకార్డులతో ర్యాలీ జరిపి మానవహారాలు చేశారు. రుద్రరాజు లక్ష్మీపతిరాజు, వేగిరాజు సుబ్బరాజు, వడ్డి గంగ, ఎస్.తులసీదుర్గారావు, వీఆర్వోలు చంద్రరావు, నార్ని వెంకటేశ్వరరావు, నాగమణి పాల్గొన్నారు.

రంగవల్లులు, వక్తృత్వ పోటీలు

మలికిపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మలికిపురం డిగ్రీ కళాశాలలో ఇద్దరు సీనియర్ ఓటర్లను సత్కరించారు. రంగవల్లులు, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, గెడ్డం తులసీ భాస్కర్, కె.సీతామహలక్ష్మి, వీఆర్వో హరి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

అంతర్వేది, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఓటర్ల దినోత్సవాన్ని ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించారు. కేశవదాసుపాలెంలో వీఆర్వో నాగరాజు అధ్యక్షతన ఓటర్లకు అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞచేశారు. వీఆర్వోలు, సర్పంచ్ మేడిద సరోజ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో మానవహారం

కాట్రేనికోన, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహశీల్దార్ పి.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఓటర్ల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కళాశాల నుంచి కాట్రేనికోన గేట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రెవెన్యూ, కళాశాల, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో అవగాహనా సదస్సు జరిగింది. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, శ్రీసందీప్, ఎస్.జయలక్ష్మి, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ పంపిణీ

అమలాపురం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నిష్ణాతులైన ఉపాధ్యాయులతో రాష్ట్రోపాధ్యాయ సంఘం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఎస్టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడం అభినందనీయమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎస్టీయూ జిల్లా, మండల శాఖల ఆధ్వర్యంలో శనివారం అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే అందజేశారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న 750మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్టు ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ పోటీలు

అమలాపురం రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి పురోహిత క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శనివారం అన్నవరం-రాజోలు జట్లు తలపడగా రాజోలు జట్టు విజయం సాధించింది. కాకినాడ రుద్రాస్-శరవణభవ జట్లు పోటీపడగా రుద్రాస్ జట్టు విజయం సాధించింది. వైజాగ్ చారీ-11-మోపిదేవి జట్ల మధ్య జరిగిన పోటీలో మోపిదేవి జిల్లా జట్టు విజయం సాధించింది. కొవ్వూరు గాయత్రీ-వైజాగ్ నృసింహ జట్లు తలపడగా కొవ్వూరు గాయత్రీ జట్టు విజయం సాధించిందని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పోచిన పెద్ది అక్షయ్, గండికోట సాయి, ఉపద్రష్ట విజయ్, ఉపద్రష్ట మహేంద్ర, నాగవినయాదిత్య తెలిపారు. ఆయా పోటీల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు ముఖ్యఅతిథులుగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, డీఎస్ఎన్ కుమార్ మెమెంటోలు అందజేశారు. ఈనెల27న సెమీఫైనల్స్, 28నఫైనల్స్ పోటీలు జరుగుతాయని నాగాదిత్యతెలిపారు.

అనారోగ్యంతో గేదెల్లంక అగ్రికల్చర్ అసిస్టెంట్ మృతి



ముమ్మిడివరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం గేదెల్లంక సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కవురు సీమాన్‌రాజు (30) శనివారం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరానికి చెందిన సీమాన్‌రాజు గేదెల్లంక సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో కాకినాడప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీమాన్‌రాజు భార్య సౌమ్య హార్టీకల్చర్ అధికారిగా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప ఉంది. సీమాన్‌రాజు మృతి పట్ల వ్యవసాయశాఖ అధికారులు,సిబ్బంది, పలువురు నాయకులుసంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గల్ఫ్ వెళ్లడానికి ఒక వ్యక్తికి మరో వ్యక్తి నుంచి కొంత నగదును అప్పుగా ఇప్పించడంలో క్రాపచింతలపూడిపాలెం గ్రామానికి చెందిన మధుర గోపాలకృష్ణ(27) మధ్యవర్తిగా ఉన్నాడు. ఆ అప్పును వారు తీర్చకపోవడంతో, సరైన సమాధానం చెప్పకపోవడంతో మనస్తాపం చెందిన గోపాలకృష్ణ కలుపు మందుతాగి అపస్మారకస్థితికి లోనయ్యాడు. అతడిని అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో హెచ్‌సీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మధుర కుటుంబరావు-పాశమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా రెండో కుమారుడు కృష్ణ. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు గొల్లవిల్లి విద్యార్థి



ఉప్పలగుప్తం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల26న జరిగే ఢిల్లీ గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ శకటం ఏటికొప్పాక బొమ్మలతో ముస్తాబైంది. ఈశకటంతో పాటు నృత్యకళా ప్రదర్శనలో రాష్ట్ర కళా, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేందుకు ప్రధాన నృత్య కళాకారులతో ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. ప్రధాన కళాకారుల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థి మదిరి తనూష్‌తేజకు చోటు దక్కింది. తమ పాఠశాల విద్యార్థికి గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కడం తమకెంతో ఆనందాన్నిచ్చిందని హైస్కూల్ హెచ్‌ఎం లంక రాణి, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీ గొలకోటి ఫణీంద్ర కుమార్, ఉపాధ్యాయులు వ్యాఖ్యానించారు.

ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించాలి

పి.గన్నవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతిపౌరుడుపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. బీజేపీ చేపట్టిన సంవిధాన్ గౌరవ అభియాన్‌లో భాగంగా పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, చీకరమిల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరావు, మాలే శ్రీనివాస్‌నాగేష్, కాపిశెట్టి కనకేశ్వరావు, గొల్లకోటి సురేష్, కోల గోపి, మానుకొండ సుబ్బారావు, పితాని వెంకటేశ్వరరావు, ఉయ్యూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకోవాలి

మలికిపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని పశు సంపదను కాపాడుకోవాలని పశు వైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు అన్నారు. శనివారం పల్లిపాలెంలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుధాదేవి, రాజబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు రిపబ్లిక్ డే వేడుకలు

మామిడికుదురు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి స్కూలులో ముందస్తు రిపబ్లిక్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థినులు పిరమిడ్ ఆకారంలో ఒదిగి ఆకట్టుకున్నారు. రిపబ్లిక్ డే విశిష్టతను కరస్పాండెంట్ జీవీవీ సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో స్కూలు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

అమలాపురం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారత గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శనివారం విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల ప్రశ్నాపత్రాలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా మాట్లాడుతూ వివిధ పాఠశాలలకు చెందిన 132మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లోను, 22మంది వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.హనుమంతరావు, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, అకడమిక్ కోఆర్డినేటర్ పీవీ బ్రహ్మానందం, క్విజ్ మాస్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బోధనలో నూతన ఒరవడి సృష్టించాలి

కాట్రేనికోన, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ విద్యా బోధనలో నూతన ఒరవడి సృష్టిస్తుందని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. శనివారం చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఎనిమిదవ దశ శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పట్టు ఉండాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా తరగతుల విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన జరిగినప్పుడే విద్యార్థుల అభ్యసనా స్థాయి పెరుగుతుందని డీఈవో సలీం భాషా అన్నారు. ఆర్జేడీ, డీఈవోలు టీఎల్ఎం మేళాను సందర్శించి ఉపాధ్యాయుల వినూత్న ఆలోచనలను ప్రశంసించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు బహూకరించారు. ఉపాధ్యాయులు ఆర్జేడీ నాగమణిని సన్మానించారు. డైట్ లెక్చరర్ కె.కళావతి, శిక్షణాకేంద్రం కోఆర్డినేటర్ పి.రాంబాబు, ఎంఈవో వైవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షిద్దాం

ముమ్మిడివరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ లక్ష్యం ఇంత వరకు సక్రమంగా అమలు కావడంలేదని, మహిళలకు రాజ్యాంగంలో పొందు పరిచిన హక్కులు అమలు కావడంలేదని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనేఅంశంపై సమీక్ష నిర్వహించారు. వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడారు. కాశి బాబూజగ్జీవన్‌రామ్, ఎం.ఆశీర్వాదం, పుల్లెపు వెంకటేశ్వరరావు, కొంకి రాజామణి, జనిపల్లి సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, బుడితి నాగేశ్వరరావు, నబ్బితి సత్యనారాయణ, నందిక ధనరాజు, మేకల మీరాసాహెబ్, పీవీ చక్రవర్తి, మచ్చా నాగబాబు, ఎన్.అబ్బులు, గిడ్ల వీరప్రసాద్, కాశి బాలకృష్ణ, బూల తులసీమణి, గుత్తాల పావనకుమారి, వి.భారతి, కె.సత్యనారాయణమూర్తి, పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నెల రోజులు మహాసౌరయాగం

ఉప్పలగుప్తం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారం శ్రీరామ మందిరంలో ఈనెల30 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు నక్షత్ర నవగ్రహ పూర్వక మహాసౌరయాగం నిర్వహిస్తున్నారు. సౌరయాగ ఆహ్వాన పత్రికను యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ శనివారం రామచంద్రపురంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అందించారు. సౌరయాగ పూజలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో సలాది సతీష్, నడింపల్లి గిరిరాజు, స్వామినాయుడు పాల్గొన్నారు.

మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా కుష్టువ్యాధి నివారణ

ఉప్పలగుప్తం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారిణి భారతలక్ష్మి అన్నారు. శనివారం భీమనపల్లి పంచాయతీ గంధంవారిపాలెంలో కుష్టు వ్యాధి గ్రస్తుల సర్వే కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. అంతకు ముందు భీమనపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాయుడు రామకృష్ణమూర్తి, హెచ్ఎస్ సత్యవతి, శ్రీహరి, ఏఎన్ఎంలు నాగమణి, అరుణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ ఎవోల్వ్‌డ్ బై ది ఫ్యూచర్ కారు



కియా సిరోస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కియా సిరోస్ ఎవోల్వ్‌డ్ బై దిఫ్యూచర్ కారును కంటిపూడి కియా సీఈవో కామేష్, వినియోగదారులు మార్కెట్‌లోకి విడుదలచేశారు. కాకినాడలోని కంటిపూడి కియా షోరూమ్‌లో శనివారం ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఈవో కామేష్ మాట్లాడుతూ ఈకారు శక్తివంతమైన పెట్రోల్, డీజిల్ ఇంజిన్స్, ఆటోఅండ్ మాన్యువల్ ట్రాన్మిషన్, 16లెవెల్ 2 అదర్ ఫీచర్స్, 6ఎయిర్‌బ్యాగ్‌లు, డ్యూయల్ పానారోమిక్ సన్‌రూఫ్, 12.3ఇంచ్ టచ్‌స్క్రీన్ నావిగేషన్ కాకిట్స్ కలిగిఉందన్నారు. హర్మన్ కాటన్ ప్రీమియం 8 స్పీకర్స్ సౌండ్ సిస్టమ్‌తో కియా కనెక్ట్ 2.0, ఓటీఏ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ విత్ కియా రియోట్ డయాగ్నోస్టిక్స్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫయర్ విత్ ఏక్యూఐ డిస్‌ప్లే, స్మార్ట్ డాష్ కామ్‌విత్ డ్యూయల్ కెమెరా లాంటి మరెన్నో అత్యాధునిక ఫీచర్స్‌తో ఈకారు అందుబాటులోకి వచ్చిందన్నారు. కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్ బాబు, ఎం. జగన్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి(చినబాబు), కె.మన్మోహన్‌రామ్, బ్రాంచ్ మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థిగా వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. యూజీసీ నిధులు రూ.60లక్షలతో నిర్మించిన ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. మహిళలు విశ్రాంతి భవనం కోరగా మంజూరు చేయిస్తానన్నారు. సర్పంచ్ బూసి జయలక్ష్మీభాస్కరరావు, ఎంపీపీ మార్గన గంగాధర్, జడ్పీటీసీ గుడపాటి రమాదేవి, కంఠంశెట్టి శ్రీనివాస్, చావలి సుబ్బరాయ శాస్త్రి, విళ్ల మారుతీప్రసాద్, బీర ఇసాక్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

'బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి'

రామచంద్రపురం (ద్రాక్షారామ), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ కోరారు. శనివారం ఆయన రామచంద్రపురంలో కార్యకర్తలను కలిశారు. సీనియర్ నాయకులు అయ్యాజీవేమా, నల్లా పవన్, టి.సత్యనారాయణరెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు దునే శ్రీనివాస్, సీనియర్ నాయకుడు యాండ్ర బుల్లబ్బులు, మండల శాఖల అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ, శివాజీ, నాయకులు కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు, అల్లం రామకృష్ణ, పోలిశెట్టి శ్రీనివాస్, కేశవ రాఘవేంద్ర, సలాది శేఖర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నారాయణలంక గ్రామస్తులు, రైతులు

'నారాయణలంకలో ఇసుక తవ్వకాలొద్దు'

కొత్తపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట-కపిలేశ్వరపురం మండలాల సరిహద్దు ప్రాంతమైన నారాయణలంకలో ఇసుక, మట్టి తవ్వకాలు జరపవద్దని రైతులు,గ్రామస్తులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనధికార ఇసుక ర్యాంపు నిర్వహణతో తమ గ్రామం వరదల సమయంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక తవ్వకాలు జరగనివ్వమన్నారు. దీంతో కపిలేశ్వరపురం తహసీల్దారు చిన్నారావు, అంగర ఎస్ఐ రవికుమార్ వచ్చి రైతులు, గ్రామస్తులతో చర్చలు జరిపారు. జిరాయితీ భూముల్లోంచి ర్యాంపు బాట వేయనివ్వమని రైతులు తేల్చిచెప్పారు. రైతులు వారి ఇబ్బందులను ఫిర్యాదు రూపంలో తెలియజేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దారు చెప్పారు. రైతు నాయకులు బండారు ధనరాజు, బండారు వెంకటేశ్వరరావు, యడ్లపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మోడరన్'లో విద్య, విజ్ఞాన ప్రదర్శన

రామచంద్రపురం (ద్రాక్షారామ), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో శనివారం విద్య, విజ్ఞాన ప్రదర్శన జరిపారు. విద్యార్థులు సైన్సు, గణిత, సాంఘిక శాస్త్ర నమూనాలను ప్రదర్శించారు. అనంతరం మోడరన్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. పలు పోటీల్లో విజేతలకు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, అకడమిక్ డైరెక్టర్లు ఆర్.ఉమాదేవి, సాయిరాంచౌదరి, తెలుగు పండిట్ ఏవీఎస్ ప్రసాద్ బహుమతులు అందజేశారు.



జాతీయ పతాకాలతో విద్యార్థినుల ప్రదర్శన

'విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి'

రాయవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు పాడవుతుందని, విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవాల నిరోధం, రేష్ డ్రైవింగ్, సెక్సువల్ హెరాస్మెంట్, మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల కలలకు అనుగుణంగా చదువుకుని ఉత్తమ పౌరులుగా తయారుకావాలని ఎస్ఐ పిలుపునిచ్చారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, హెచ్ఎం వి.శాంతిసునీత, రాయవరం, లొల్ల, వి.సావరం గ్రామాలకు చెందిన మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రామచంద్రపురం (ద్రాక్షారామ), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని పలు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి వాసంశెట్టి సుభాష్‌తండ్రి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శనివారం ప్రారంభించారు. కమిషనరు అయ్యప్పనాయుడు, డీఈ జి.శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పాలపర్తి శ్వేతాపావని, అంకం శ్రీనివాస్, గడి గోవిందు, పైడిమళ్ల సత్తిబాబు, కూటమి నాయకులు గుణ్ణం వినోద్‌కుమార్, దంగేటి గౌరీశంకర్, కొట్టువాడ హరిబాబు, కవల నానాజీ, మాజీ కౌన్సిలరు అల్లం శ్రీనివాస్, బాబూరావు పాల్గొన్నారు.

మండపేట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు ఆనందనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పి.నూకరాణి శనివారం శంకుస్థాపన చేశారు. వార్డు కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి, మున్సిపల్ ఏఈ అంజనేయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయవరం ఉన్నత పాఠశాల తనిఖీ

రాయవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయవరం ఉన్నత పాఠశాలను డీఆర్పీలు డి.బాబూరావు, పి.కోటయ్య శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు, సమగ్ర శిక్షా ద్వారా పాఠశాలకు సమకూరిన వనరులు, పనితీరును పరిశీలించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి పాఠశాల గురించి చర్చించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌బాబు, హెచ్ఎం వి.శాంతిసునీత తదితరులు పాల్గొన్నారు.

టీపీవోగా రమ్య బాధ్యతల స్వీకారం

మండపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండపేట టౌన్ ప్లానింగ్ అధికారిగా పెద్దాపురం మున్సిపాల్టీలో సూపర్‌వైజరుగా పనిచేస్తున్న రమ్య ఉద్యోగోన్నతిపై వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన ఆమె చైర్‌పర్సన్ రాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు టీపీవోగా పనిచేసిన శ్రీధర్ ఉద్యోగోన్నతిపై కాకినాడ నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బదిలీ అయ్యారు.



రామచంద్రపురంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీవో అఖిల





మండపేటలో ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేకాధికారి బాలసరస్వతి, కొత్తపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ద్రాక్షారామ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగంతోనే ప్రజలకు పాలకులను ప్రశ్నించే హక్కు ఉంటుందని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇష్టం లేని పక్షంలో నోటా ద్వారా అభిప్రాయం తెలియపరచవచ్చన్నారు. ఓటర్లు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళవలసి ఉందన్నారు. యువ ఓటర్లు ఇంట్లో పెద్దలను చైతన్యం చేయాలన్నారు. సీనియర్, యువ ఓటర్లను ఆర్డీవో సత్కరించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేవారు. తొలుత రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దారు ఎం.సావిత్రి, ఎంఈవో నాగేశ్వరి, మున్సిపల్ కమిషనరు అయ్యప్పనాయుడు, డిప్యూటీ తహసీల్దారు, వీఆర్వోలు, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు ప్రత్యేకాధి కారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు ఎం.బాలసరస్వతి అన్నారు. పట్టణంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ హక్కు నమోదు చేసుకుని ఎన్నికల్లో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత రథం గుడి సెంటర్లో అదిత్య విజ్ఞాన్ కళాశాలల విద్యార్థులు మానవహారం నిర్మించారు. అక్కడి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. తహసీల్దారు పి.తేజేశ్వరరావు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు మెహర్‌బాబా, మున్సిపల్ మేనేజరు హరిమోహన్, బీఎల్వోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాటిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకల్లో ఆయనతో పాటు ఆర్డీవో పి.శ్రీకర్ పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్లను సత్కరించి పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ బూసి జయలక్ష్మీభాస్కరరావు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, పల్లి శాంతి, రెడ్డి తాతాజీ, బీర ఇసాక్, విళ్ల మారుతీప్రసాద్, పాలూరి సత్యానందం, కంకటాల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొంది వినియోగించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఆలమూరు, మూలస్థానం, జొన్నాడ, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక, నవాబుపేట, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, చింతలూరు, సూర్యారావుపేట, కలవచర్ల, పెనికేరు గ్రామాల్లో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో సీనియర్ ఓటర్లను తహసీల్దారు బండి మృత్యుంజయరావు సన్మానించారు. నూతనంగా మంజూరైన ఓటరు కార్డులను అందజేశారు. అముజూరులో సర్పంచ్ నానావరపు కల్యాణ శ్రీనివాస్, కూళ్లలో సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు, కుందూరులో కూటమి నాయకుడు జగతా రమణ ఆధ్వర్యాల్లో ఓటర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): గోపాలపురం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. తెలుగు రైతు ప్రధాన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అధికారి నాగు విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందజేశారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తహసీల్దారు బీఎం ముక్తేశ్వరరావు హాజరయ్యారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు వాసంశెట్టి కనికిరెడ్డి, ఎస్ఎంసీల అధ్యక్షులు నందం వీర వెంకట సత్యనారాయణ, కోట సోమేశ్ తదితరులు పాల్గొన్నారు. రావులపాలెం యూపీ పాఠశాలలో విద్యార్థులు గీసిన చిత్రం ఆకట్టుకుంది.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ విద్యా సంస్థల్లో ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన జరిపి మానవహారం నిర్మించారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, మండల విద్యా శాఖాధికారులు ప్రసాద్, సాహెబ్, రెవెన్యూ, సచివాలయ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు ఐపీ శెట్టి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఓటుపై ఆధారపడి ఉన్నందున 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. మండలంలోని వెదురుపాక పంచాయతీ కార్యాలయం వద్ద ముగ్గులు పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి, యు.రేణుక, కూటమి నాయకులు కొవ్వూరి చంటిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, వాసంశెట్టి సాయిబాబా, పవన్, కిషోర్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. సీనియర్ ఓటరును సన్మానించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, జనసేన నాయకుడు పిల్లా బసవరాజు, గ్రామ ఉపాధ్యక్షుడు తోరాటి శ్రీను, దానేటి శరత్, మేడిద రాంబాబు, సుధాతేజ, వీఆర్వో మహాలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రావులపాలెం మండలం గోపాలపురంలో విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందజేస్తున్న తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



రాయవరం మండలం వెదురుపాకలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం







ఆలమూరు మండలం మూలస్థానం, కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలం అంగరల్లో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆధునిక జీవనశైలిలోనూ

సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

డాక్టర్ రవికుమారాచార్య



ఆలమూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలిలోనూ మన సంప్రదాయాన్ని కాపాడుకోవచ్చని మధురభారతి బిరుదాంకితుడు డాక్టర్ వోలేటి రవికుమారాచార్య అన్నారు. మండలంలోని చింతలూరు వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం ఆయన వేంకటేశ్వర మహత్యం, బ్రహ్మోత్సవ విశిష్టతను వివరించారు. మన పురాణేతిహాసాల్లోని అంశాల్ని నేటి తరానికి అర్థమయ్యేలా చెప్పడం ద్వారా వారిని సన్మార్గం వైపు నడిపించవచ్చని చెప్పారు. తిరుమల పవిత్రత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని కాపాడాలని కోరారు. ఆలయ నిర్వాహకులు అల్లంరాజు భరణి, ద్విభాష్యం కాశీవిశ్వనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు

ఆలమూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరులో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆలమూరు వెటర్నరీ ఏడీ ఎల్.అనిత పశువులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పశువైద్యులు సుభాష్, రామకృష్ణ, నాయకులు వైట్ల గంగరాజు, వైట్ల శేషుబాబు, మార్గాని ఏసు, దేశాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): లొల్లలో పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు ప్రారంభించారు. పశువైద్యురాలు నాగ శ్రావణి పశువులను పరీక్షించారు. ఎంపీటీసీ వైట్ల సతీష్ పాల్గొన్నారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): కూళ్ల శివారు తమ్మయ్యపాలెంలో 40 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. 29 మంది రైతుల పశువులకు డీవార్మింగ్ మందులు, లివర్ టానిక్‌లు అందజేశారు.

పశువుల పాక, గడ్డివాము దగ్ధం

కె.గంగవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్లపాలిక పంచాయతీ పరిధిలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న పిల్లి సూర్యనారాయణకు చెందిన పశువుల పాక, గడ్డివాము శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమయ్యాయి. పాకలో పది బస్తాల పిండి, డీఏపీ యూరియా ఉన్నాయని, పశువులకు ఎటువంటి హాని జరగలేదన్నాడు. సుమారు రూ.లక్ష నష్టం సంభవించిందని బాధితుడు చెప్పాడు.



రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాత పాపారావు

బ్రహ్మోత్సవాలకు రూ.లక్ష విరాళం

ఆలమూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలమూరుకు చెందిన రైస్‌మిల్లర్, వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు రూ.1,01,116 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని బ్రహ్మోత్సవాల నిర్వాహకులు అల్లంరాజు భరణి, ద్విభాష్యం కాశీవిశ్వనాథశర్మలకు శనివారం అందజేశారు. భారీ విరాళం అందించిన దాత పాపారావును పలువురు అభినందించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. బూత్ ఇన్‌చార్జిలు వారికి ఇచ్చిన ఓటర్ల జాబితాలను పరిశీలించి ఓట్లు నమోదయ్యేలా కృషి చేయాలని సత్యానందరావు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

వచ్చే నెల 7న సాంస్కృతిక ప్రదర్శన

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న నిర్వహించే భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొడమంచిలి చిరంజీవి, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు యర్లగడ్డ మమ్ము పిలుపునిచ్చారు. కొమరాజులంకలో వారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కాపా నాగరాజు మాట్లాడుతూ అధిక సంఖ్యలో డప్పులతో పాల్గొనాలన్నారు. కొమ్ము నారాయుడు, సవరపు శ్రీను, దిగుమర్తి పండు, కొల్లి రాజేంద్రప్రసాద్, ములగలేటి రమేష్, యార్లగడ్డ సత్యనారాయణ, యార్లగడ్డ పెదరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఒక్కరోజు ఆదాయం రూ.1.74 లక్షలు

కొత్తపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి ఏకాదశి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనానికి, తైలాభిషేకానికి క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,74,271 వచ్చిందని సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దారు రాంబాబు

కొత్తపేట తహసీల్దారుకు

ఉత్తమ అవార్డు

కొత్తపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట తహసీల్దారు వై.రాంబాబు ఉత్తమ అవార్డు అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అవార్డు అందజేశారు.

బెస్ట్ బీఎల్వోగా ఉమామహేశ్వరరావు



కపిలేశ్వరపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్ప వీఆర్వో గన్నవరపు ఉమామహేశ్వరరావు బెస్ట్ బీఎల్వో అవార్డు అందుకున్నారు. విజయవాడలో శనివారం జరిగిన ఓటర్ల దినోత్సవ సభలో ఆయనకు చీఫ్ సెక్రటరీ విజయానంద్ ప్రశంసాపత్రం అందజేశారు.

రామచంద్రపురం పురపాలక సంఘం

ఆర్.ఒ.సి.నెం.41/24-ఇ1, తేది.25-01-2025

ఇ.ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

రామచంద్రపురం పురపాలక సంఘం నందు 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు పురపాలక సంఘ సాధారణ నిధులు నుండి 12 నెం.లు పనులు చేయుటకు గాను సుమారుగా రూ.47.26 లక్షల అంచనాలతో టెండర్లు పిలువబడినది.

షార్టు టెండర్ బిడ్ డౌన్‌లోడ్ : ప్రారంభ తేది.25-01-2025 రా.గం॥ 7.00ల నుండి ముగింపు తేది.28-02-2025 సా గం॥ 3.00 వరకు

షార్టు టెండర్ బిడ్ డౌన్‌లోడ్ : ప్రారంభ తేది.26-01-2025 ఉ.గం॥10.00ల నుండి ముగింపు తేది.03-02-2025 సా గం॥ 3.00 వరకు

మిగిలిన వివరములు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/- వి.ఐపిఐ నాయుడు
కమీషనరు
రామచంద్రపురం మున్సిపాలిటీ